# సింగిల్ పేజీ కథలు

# ప్రతిఫలం

గది తలుపు తెరిచి లోపలకు వెళుతున్నప్పుడు వచ్చాడు అతను. అతనంటే పెద్దమనిషి కాదు. పదకొండేళ్ళ వాడు. వాడి పేరు శివ. సెవెంత్‌క్లాసు చదువుతున్నాడు.

"అనిలక్క ఇప్పుడు మీ ఇంట్లో ఉందా!" అడిగాను వాడిని.

"లేదు. ఇంతకుముందే ఇంటికి వెళ్ళిపోయింది"

"నేనో వారపత్రిక ఇస్తాను. దాన్ని అనిలకు ఇస్తావా?"

"ఇవ్వండి. ఇప్పుడే ఇచ్చివస్తాను"

వెంటనే టేబిల్ సొరుగులోనించి ఓ వారపత్రికను తీసి దానిమీద నా పూర్తిపేరు రాసి వాడికి ఇచ్చాను. దానితోపాటు బాలమిత్రను కూడా ఇచ్చి "రేపు ఉదయం దీన్ని నువ్వు తప్పకుండా ఇవ్వాలి. ఇక ఈ పత్రికలో నేను రాసిన ఓ కథ ఉందని అనిలకు చెప్పు" అన్నాను.

తలవూపి వాడు సంతోషంతో బయటకు ఒక్క పరుగు తీశాడు.

ఆ వారం ఓ వారపత్రికలో నేను రాసిన కథ అచ్చయ్యింది. ఇప్పుడు ఆ కథను అనిల చదువుతుంది. ఆమె దృష్టిలో ఓ రచయితగా నా వాల్యూ పెరుగుతుంది. అప్పుడు అనిలతో ప్రేమాయణం జరపటానికి ఎక్కువ టైము తీసుకోదు.

అనిల డిగ్రీ రెండో సంవత్సరం చదువుతోంది. చురుకయిన ఆమె కళ్ళు చూసినప్పుడల్లా ఆమెకు త్వరగా దగ్గర కావాలనే ఆరాటం నాలో కలుగుతోంది.

ఉదయమే ఆ వీధి చివరవున్న హోటల్లో టిఫిన్ చేసి వస్తున్నాను.

దార్లో నా వీక్లీ తీసుకుని వస్తున్న అనిల కలిసింది. ఇంట్లోనించి బయటకు వచ్చి-"మీ కథ బావుంది. చాలా బాగా రాశారు" అన్నది అనిల.

"థాంక్స్" అన్నాను చిరునవ్వుతో.

"మీరు కథలు రాస్తారని నాకు తెలీదు"

"ఈమధ్యనే ఈ వీధిలోకి వచ్చాను కదా! అందువల్ల ఎవరికీ తెలియదు"

"మీరెక్కడ వర్క్ చేస్తున్నారు?" అడిగింది.

చెప్పాను.

"ఇంకా మీరు రాసిన కథలు ఉన్నాయా?" ఆ వారపత్రికను నాకు ఇస్తూ అడిగింది.

"చాలా ఉన్నాయి. రండి తీసుకెళుదురుగాని" అన్నాను చనువుగా.

అనిల తనంతట తానుగా నాతో మాట్లాడినప్పుడే నాకు ఆమె గురించిన సైకాలజీ తెలిసిపోయింది. ఆ అమ్మాయికి రచయితల పట్ల క్రేజ్ బాగానే ఉన్నది. కాబట్టి నా వెంట గదిలోకి వస్తుందనే అనుకున్నాను.

అనుకున్నట్లుగానే వచ్చింది.

"కూర్చోండి"

"ఫర్వాలేదులెండి" అన్నది నిల్చునే.

నా కథలు నిజానికి ఓ పదికి మించి అచ్చుకాలేదు. వాటినే ఆ వారపత్రికల నించి కట్ చేసి నీట్‌గా బైండ్ చేయించాను.



ఆ బుక్‌నే అనిలకు ఇచ్చి "ఇంకా ఇలాంటి వాల్యూమ్స్ చాలా ఉన్నాయి. నా ఫ్రెండ్స్ చదివి ఇస్తామని తీసేసుకున్నారు. ముందు ఈ కథలను చదవండి" అని చెప్పాను.

"ఎక్కువగా మీరు ఎలాంటి కథలు రాస్తూ ఉంటారు?"

"వయసులో వున్న పెళ్ళికాని కుర్రవాడ్ని ఎలాంటి కథలు రాస్తాను? ఈ వయసు కథలే, లవ్‌స్టోరీస్" మళ్ళీ నవ్వాను.

అనిల కూడా నవ్వింది.

"ఎందుకు ఈ ప్రశ్నలన్నీ అడుగుతున్నారు? మీక్కూడా అర్జంటుగా కథలు రాసేసి అచ్చులో మీ పేరును చూసుకోవాలని వుంది కదూ?" అన్నాను మెల్లగా ఆ అమ్మాయిని నా లైనులోకి తీసుకురావాలని.

నవ్వుతూ తల వూపింది అనిల.

"నాకు తెలుసు. కథలు రాయటమనేది నిజంగా దేవుడిచ్చిన వరం. అది అందరికీ సాధ్యం కాదు. నాలాంటి ఏ కొద్ది మందికో అది సాధ్యమవుతుంది. మీకోసం నేను ఓ పని చేస్తాను. ఏమిటంటే ఓ కథరాసి దానికి మీ పేరు పెట్టి ఏదో పత్రిక్కి పంపుతాను. సరేనంటారా?" అన్నాను.

అనిల మళ్ళీ తల ఊపింది.

"ఆ కథ పడిన తరువాత ప్రతిఫలంగా నాకేం ఇస్తారో చెప్పండి" చిలిపిగా అడిగాను.

"ఆ కథకు పత్రికవాళ్ళు పంపించే డబ్బును మీరే తీసుకోండి" అన్నది వెంటనే.

"డబ్బు..ఎవడిక్కావాలి? నేను డబ్బును లెక్కచేసే మనిషిని కాను. అయితే మీరు ప్రతిఫలంగా ఇంకేమీ ఇవ్వలేరా?" అన్నాను ఈసారి కొంటెగా.

"సర్లెండి ముందు ఆ కథను రాయండి" అని ముసిముసిగా నవ్వుకుంటూ వెళ్ళిపోయింది అనిల.

నా అదృష్టం. అనిల లైన్లోకి వస్తోంది. రాక ఏం చేస్తుంది? నేను విసిరిన వల అలాంటిది.

టైము చూశాను. తొమ్మిది గంటలు దాటుతోంది.

అరగంటలో స్నానం చేసి డ్రెస్ చేసుకున్నాను.

గదికి తాళం వేసి ఆఫీసుకు బయల్దేరే ప్రయత్నంలో ఉన్నాను. సరిగ్గా అప్పుడే వచ్చాడు శివ.

వాడు ఓ నవలను నా చేతికి ఇచ్చి, "దీన్ని అనిలక్క మీకు ఇవ్వమని చెప్పింది" అని వెళ్ళిపోయాడు.

ఆ నవల పేరు చూశాను. 'నీలిరాగాలు'. ఆ నవల ఆర్నెల్ల క్రితం మూడు నెలలపాటు ఓ ప్రముఖ వారపత్రికలో సీరియల్‌గా వచ్చింది. దాన్ని 'హంసలేఖ' అనే ఆమె ఎవరో రాసింది.

ఈ నవలను అనిల నాకెందుకు పంపించిందీ అనుకుంటూ దాన్ని వెనక్కు తిప్పి చూసిన నాకు గుండె ఆగినంతపనయింది. వెనుక వైపు అనిల ఫొటో ఉన్నది. ఫొటో క్రింద వున్న మేటర్‌ని చదివి ఉలిక్కిపడ్డాను.

'హంసలేఖ' పేరుతో ఎన్నో కథలు, నవలలు రాస్తున్నది అనిలే.

నా కళ్ళు తిరిగాయి. నా చెయ్యి కూడా కొంచెం వణికింది. అనిల ముందు ఎన్ని కోతలు కోశాను?

ఇంతలో ఆ నవల్లోనించి ఓ చిన్న కాయితం కిందపడింది. దాన్ని తీసుకున్నాను ఆత్రంగా. అందులో ఇలా ఉంది.

'ఓ రచయితగారూ!

కథలు రాయడం దేవుడిచ్చిన వరమే. ఇందుకు నేను కూడా ఒప్పుకుంటాను. కానీ దాంతో అందమైన, అమాయకులైన అమ్మాయిలకు వల విసిరి, వాళ్ళ జీవితాలను శాపంగా మార్చకండి. నిజానికి ఈ సమాజం పట్ల ఎక్కువ బాధ్యత కలిగిన మనిషి రచయితే. ఇకనైనా మీరు ఏ అమ్మాయినీ-నీ పేరుతో కథ రాసి పంపినందుకు ప్రతిఫలంగా నాకేమిస్తావు అని అడగరనుకుంటాను' -అనిల.

**-బద్దిగం పాండురంగారెడ్డి**
(జగిత్యాల)